

ఎరువుల దుకాణాల తనిఖీ

కొందుర్గు, ఏప్రిల్ 15 : కొందుర్గులోని ఎరువుల దుకాణాలను సోమవారం షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. రైతులు తీసుకున్న వాటికి బిల్లులు తప్పక ఇవ్వాలని, అమ్మకం వివరాలను రోజూ స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రాంచంద్రాపూర్‌లోని ఎరువుల దుకాణాలను కూడా ఏడీఏ తనిఖీ చేశారు.



స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ



యాచారం మండలం నందివనపర్తిలో ఎండిన వరి చేనులో మేస్తున్న గొర్రెలు

వరి గోస!

కొన్నేళ్లుగా బాగానే పండిన యాసంగి పంటలు ఈ సారి నీటి కొరత ఏర్పడి మాడిపోతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అంతటా వరి చేలకు నీరందక ఈనే దశలో ఎండుతున్నాయి. కళ్ల ముందే పంట ఎండుతుండడంతో రైతుల గుండె తరుక్కుపోతోంది. దిగుబడి, పెట్టుబడి రెండూ మునిగే పరిస్థితి తలెత్తింది. దీంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. ఎండిన వరి పొలాల్లో పశువులు, గొర్లు, మేకలను మేపుతున్నారు. వరి మాత్రమే కాదు కూరగాయ పంటలకూ నీరందడం లేదు. పంట వేసే సమయంలో పోసిన బోర్లు రెండు నెలల్లోనే మొత్తం ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు చివరి ప్రయత్నంగా ట్యాంకర్లతో పంటలకు నీరందిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు వెయ్యి రూపాయలు వెచ్చిస్తున్నారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు

కూరగాయ పంటలు వేసిన వారానికే బోరు ఎండింది

కింద ఫొటోలో ట్యాంకర్‌తో కూరగాయ తోటకు నీరు పెడుతున్న రైతు పేరు అచ్చన్న రాజు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డమల్లయ్యగూడ. ఎకరంలో టమాట, చిక్కుడు, పచ్చి మిర్చి వేశాడు. పంటలు వేసిన వారానికే బోరు ఎండింది. కూరగాయ పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ నీరు తెచ్చి పోస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000 ఖర్చు అవుతోందని, ఇప్పటి దాకా ట్యాంకర్లకే రూ.15వేలు ఖర్చు పెట్టానని, మరో రూ.10వేలు ఖర్చు పెడితేనే పంట చేతికొస్తుందని రైతు చెప్పాడు. బోరు ఎండి నీటిని సైతం కొనే పరిస్థితి ఏర్పడిందన్నాడు. కూరగాయల సాగుకు రూ.65వేల అప్పు చేశానని, పంట చేతికొస్తేనే అప్పు తీరుతుందని ఆవేదన వెలిబుచ్చాడు. ఈ ప్రాంతంలో బోర్లు ఎండడంతో కొందరు రైతులు 2వేల ఫీట్ల లోతు దాకా బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు రావడం లేదు.



యాచారం : గడ్డమల్లయ్యగూడలో మిర్చి తోటకు ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు రాజు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/యాచారం, ఏప్రిల్ 15) : వానకాలం కలిసిరాలేదు.. కనీసం యాసంగిలో అయినా దిగుబడి వచ్చి కొంత మేర అప్పుల భారం తగ్గించుకోవచ్చనుకున్న వరి రైతులకు నిరాశే మిగులుతోంది. మండుతున్న ఎండలకు తోడు.. సాగునీరందక వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో గతేడాది కంటే ఈ మార్చి నెలతో పోల్చుకుంటే సగటు భూగర్భ జలాల నీటి మట్టం 3.68మీటర్లకు పడిపోయింది. దీంతో వ్యవసాయ బోర్లలో నీరు తగ్గి గ్యాప్ ఇస్తున్నాయి. చాలా చోట్ల బోర్లలో నీరు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయి. ఈ సారి యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో 1,27,263 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అందులో వరి 95,134 ఎకరాలు వేశారు. ఎండలకు ఇప్పటికే 600 ఎకరాల్లో పంట ఎండి పోయింది. యాచారం మండలం ఎనకింది తండా, మంతనిగౌరెల్లి, నల్లబెల్లి గ్రామాల్లో వరి చేను ఎండి పశువులకు మేతగా మారింది. దీంతో పెట్టుబడికి చేసిన అప్పులెలా తీర్చాలని రైతులు నెత్తికి చెయ్యి పెట్టుకుంటున్నారు. మంచాల మండలంలో వరి చేను, కూరగాయ పంటలు ఎండిపోతున్నాయి. ట్యాంకర్లతో నీరు పోసి పంటను బతికించుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. చివరకు చేసేదేమీలేక నెర్రలు వారిన చేన్లలో పశువులను మేపుతున్నారు. యాచారం మండలం నందివనపర్తిలో శేఖర్ రెడ్డి రెండెకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటికే రూ.70వేల పెట్టుబడి పెట్టాడు. పంట ఈనేదశలో ఉన్న సమయంలో బోరు ఎండిపోయింది.



కొడంగల్‌లో బోరు వేస్తున్న రైతు

దాంతో రైతు చేసేదేమీ లేక ఎండుతున్న వరి చేనులో గొర్లను మేపుతున్నాడు. ఇదే గ్రామంలో దాదాపు మరో 15 మంది రైతుల వరి చేను ఎండింది. పొలాన్ని పశువులకు మేతగా వదిలేశారు.

వికారాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 60 వేల కుపైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. వీటిలో సగాని కిపైగా నీళ్లు పోసే పరిస్థితి లేదు. జిల్లాలో యాసంగిలో 1,32,962 ఎకరాల్లో సాగు చేశారు. వరి 89,834 ఎకరాలు, వేరు శనగ 12,810 ఎకరాలు, శనగలు 5,854 ఎకరాలు, మొక్కజొన్న 8,931 ఎకరాలు, జొన్నలు 10,897 ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలు కలిపి 5,536 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ప్రధానంగా పరిగి, దోమ, కులకచర్ల, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల, తాండూరు తదితర మండలాల్లో వరితోపాటు ఇతర పంటలు ఎండిపోయాయి. వికారాబాద్ జిల్లా పరిగి సబ్ డివిజన్‌లో దోమ, కులకచర్ల, చౌడాపూర్, పరిగి మండలాల్లో 50వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ముఖ్యంగా 40వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం బోరు

- ఉమ్మడి జిల్లాలో అడుగంటుతున్న బోర్లు
- మంబాపూర్‌లో విద్యుత్ సమస్యతో ఎండిన వరి
- మరమ్మతుకు నోచుకోని కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల భగీరథ యత్నం
- నీరందక ఎండిన చేలను పశువులకు మేతగా వదిలేస్తున్న రైతులు

బావుల్లో నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. సాగు చేసిన పంటలో 40 శాతం పంటలు చేతికి రాకుండా పోయాయి. తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో విద్యుత్ సమస్య కారణంగా 20ఎకరాల్లో వరి పంట ఎండు ముఖం పట్టింది. కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలకు సరైన మరమ్మతులు, నిర్వహణ లేక ఆయకట్టు కింద పంటలు సాగవడం లేదు. పదేళ్లుగా ఇక్కడ ఇదే తంతు కొనసాగుతోంది. కొడంగల్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో వరి, ఇతరఆరుతడి పంటలు సాగు చేయగా, ఈ పంటల్లో 50శాతం పంటలకు నీరందక ఎండుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేస్తున్నా ఫలితం ఉండడం లేదు. అక్కడక్కడ ట్యాంకర్లతో నీరు పెడుతూ పంటలను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

30వేల ఎకరాల్లో పంటలకు నష్టం!

వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు దాదాపు మూడువేల ఎకరాల్లో పంటలకు నీరందక ఎండిపోయినట్లు చెబుతుండగా, వాస్తవంగా క్షేత్రస్థాయిలో పదిరెట్లు అంటే 30వేలకుపైగా ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఎండుతున్న పంటలను ఎలాగైనా కాపాడుకోవాని వందల ఫీట్ల లోతుకు బోర్లు వేస్తున్నారు. అయినా చుక్క నీరు రాక రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వరి పొట్టకొస్తున్న సమయంలో సరిపడా నీరు లేకపోతే పంటలను కాపాడుకోవడం తలకు మించిన భారమవుతోందని రైతులు బోరుమంటున్నారు.



దోమ మండలం పోతిరెడ్డిపల్లిలో ఎండిన వరి చేను

నాలుగు ఎకరాల్లో వరి చేను ఎండిపోయింది



ఈ సారి బోర్లలో నీరు మొత్తమే లేకుండా పోయింది. పంటకు నీరందించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. వరి చేను మొత్తం ఎండుతోంది. నేను 5 ఎకరాల్లో వరి సాగు చేస్తే ఇప్పటికే 4 ఎకరాల్లో పూర్తిగా పంట ఎండిపోయింది. మిగిలిన ఎకరానికి కూడా నీరందక ఎండుతోంది. పంట ఎలాగూ పండే పరిస్థితి లేదు. సాగుకు రూ.1.2లక్షల వరకు ఖర్చు చేశాను. పెట్టుబడి మునిగే పరిస్థితే ఉంది.

- కృష్ణయ్య, రైతు, బండవెల్కిచర్ల, కులకచర్ల మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రారంభంలో బోరులో నీరు పుష్కలంగా ఉండటంతో రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. పంట చేతి కొచ్చే సమయంలోనే బోరులో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. దీంతో చేసేదేమీ లేక వరిచేను పశువులకు మేత అయింది. ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎండిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి

- కె.నర్సింహులు, రైతు, బాసుపల్లి, దోమ మండలం

ఎండిపోతున్న మాట వాస్తవమే



వికారాబాద్ జిల్లాలో అన్ని పంటలు సాధారణ సాగుకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. భూగర్భజలాలు తగ్గిపోతున్నమాట వాస్తవమే. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో వరి పంట ఎండిపోయింది. ఇంకా ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు మూడువేల ఎకరాల్లో ఎండిపోయినట్లు ప్రాథమిక అంచనా.

- గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

తాగునీటి సమస్య రాకుండా చర్యలు : కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 : జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని మంచాల, యాచారం మండలాల్లో తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. వేసవి ముగిసి, వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరాను నిత్యం నిశితంగా పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో తాగు నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నీటి సమస్య ఉన్న చోట ట్యాంకర్లతో సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, అర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాజేశ్వర్‌రావు, మంచాల, యాచారం ఎంపీడీవోలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లో రోడ్డు పక్కన సంరక్షణ లేక ఎదగని ఈత మొక్కలు

ఈత వనం.. నిర్లక్ష్యానికి సాక్ష్యం!

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 15 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటిన మొక్కలు పర్యవేక్షణ లోపంతో ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణను క్షేత్రస్థాయి సిబ్బంది గాలికొదిలేశారు. మండల పరిధి హిమాయత్‌నగర్‌లోని సర్వే నంబర్ 22లో గల ప్రభుత్వ భూమిలో అప్పటి ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావుగౌడ్ 2017 జూలై 25న తెలంగాణకు హరితహారంలో భాగంగా ఈత వనాన్ని ఏర్పాటుకు ఈత మొక్కలు నాటారు. ఈ మొక్కలను సంరక్షించాల్సిన పంచాయతీ, ఆబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోక ఈత వనం ఏర్పాటు కావాల్సిన చోట నేడు మొక్కలు ఎండిపోతూ పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తున్నాయి. మొక్కల సంరక్షణ లేక పిచ్చి మొక్కలు పరుచుకున్నాయి. పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని, నాటిన మొక్కలను నరికేసి ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. నామినేషన్ల ప్రక్రియపై సోమవారం రాజేంద్రనగర్‌లో గల ఆర్వో కార్యాలయంలో ఏఆర్వో, ఏఈఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నిర్వహించే నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తామని చెప్పారు. నామినేషన్లు స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు ఉదయం రోజూ 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు సూచికను ఏర్పాటు చేసి ఇతరులెవరినీ ప్రవేశించకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ వేసే వారు, బలపరిచే మరో నలుగురిని మాత్రమే ఎన్నికల కార్యాలయంలోకి అనుమతించాలని సూచించారు. నామినేషన్ల స్క్రూటినీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారనే సమాచారం అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు వీడియో గ్రాఫింగ్ చేయించడం జరుగుతుందన్నారు. నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, అదే విధంగా నియమ నిబంధనలను అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు తెలియజేయాలన్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటి నుంచే వ్యయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం

- శిక్షణా తరగతులకు సిబ్బంది గైర్హాజరు
- కొరడా ఝుళిపించిన కలెక్టర్
- దాదాపు 350 మందిపై చర్యలకు ఆదేశం
- ప్రజాప్రాతినిధ్య చట్టం కింద క్రిమినల్ కేసుల నమోదు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొరడా ఝుళిపించారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం ముమ్మరంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో 8,126 మందిని పీఓలు, ఏపీఓ, ఓపీఓలుగా నియమించారు. వీరందరికీ ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో నియోజకవర్గాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పెద్ద సంఖ్యలో సిబ్బంది గైర్హాజరయ్యారు. వీరందరికీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు వీరందరికీ రెండో విడత ఈ నెల 10వ తేదీన శిక్షణ తరగతులు నిర్వహించారు. అయితే ఈ తరగతులకు కూడా కూడా కొందరు గైర్హాజరయ్యారు. కొందరు ఎన్నికల అధికారుల, సిబ్బంది విధుల నిర్వహణ, శిక్షణ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కలెక్టర్ చర్యలకు దిగారు. కాగా ఎన్నికల శిక్షణా తరగతులకు గైర్హాజరైన దాదాపు 350 మంది ఎన్నికల అధికారులు, సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే విధుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిలో పీవోలు, ఏపీవోలే 180 మంది ఉన్నారని, మిగతా వారు ఇతర ఎన్నికల సిబ్బందిగా అధికారులు తేల్చారు. వీరందరిపైనా క్రమశిక్షణ చర్యలతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద(ఆర్పీపీ) క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

ఆధ్యాత్మిక సేవలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలి

కందుకూరు, ఏప్రిల్ 15 : ఆధ్యాత్మిక సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొని, సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి కోరారు. సోమవారం దాసర్లపల్లి తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆమె పూజలు చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడారు. ప్రతి గ్రామంలో పాఠశాల, వైద్య ఆరోగ్య కేంద్రం ఎంత అవసరమో, ఆలయాల నిర్మాణం కూడ అంతే అవసరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ఇదే విధమైన పాలన అందించారని గుర్తుచేశారు. మారుమూల గ్రామమైన దాసర్లపల్లి తండాలో ఇలాంటి ఆలయాన్ని నిర్మించడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు టి.ఇందిరదేవేందర్, మాజీ సర్పంచ్ పి.బాలమణిఅశోక్, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, రాణాప్రతాప్, పి.అశోక్, ఆనంద్, ప్రకాశ్‌రెడ్డి, సామయ్య, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, దీక్షిత్ రెడ్డి, రామకృష్ణ, నవీన్‌కుమార్, గణేష్, జి.రవీందర్, లక్ష్మణ చారి, వెంకట్‌రెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



దాసర్లపల్లి తండా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న సబితారెడ్డి

చందన్‌వెల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల మధ్య నక్షబాట వదలాలి

షాబాద్, ఏప్రిల్ 15 : చందన్‌వెల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల మధ్య నక్షబాట వదలాలని ఈ రెండు గ్రామాల ప్రజలు సోమవారం చేవెళ్ల ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... సర్వే నంబర్ 190 నుంచి పూర్వం నుంచి నక్షబాట ఉండేదన్నారు. అయితే చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో రివాల్వ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైన తరువాత ఆ కంపెనీ నక్షబాటను మూసివేసింది. చందన్‌వెల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గ్రామల రోగులు వస్తారు. అంతిరెడ్డిరెడ్డి, మాచన్‌పల్లి గ్రామస్తులు చందన్‌వెల్లికి నక్షబాట గుండానే వెళ్లేవారు. ఇదే వారికి దగ్గరవుతుంది. తమకు హైతాబాద్ మీదుగా వెళ్తే దూరం అవుతోందని, అధికారులు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి నక్షబాట వదిలేలా చూడాలని ఆర్డీవోకు విన్నవించారు. కార్యక్రమంలో చందన్‌వెల్లి, అంతిరెడ్డిగూడ వాసులు చేవెళ్ల స్వామి, శ్రీనివాస్, రాజు, నర్సింహులు, గోపాల్, కిష్టయ్య ఉన్నారు.



ఆర్డీవోకు వినతిప్రతం ఇస్తున్న గ్రామస్తులు

నేడు విద్యుత్ అంతరాయం

మర్పల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికల్ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత

వికారాబాద్, ఏప్రిల్ 15: కోనేరు రంగారావు యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నిర్వహించిన ఎంబీబీఎస్ 4వ సంవత్సరం వార్షిక పరీక్షల్లో మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(మిమ్స్) విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 4వ సంవత్సరం విద్యార్థుల్లో 12మంది డిస్టింక్షన్ సాధించినట్లు మిమ్స్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 26మంది, మూడవ సంవత్సరం పరీక్షల్లో 33 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి డిస్టింక్షన్ సాధించారని ఆయన చెప్పారు. వార్షికపరీక్షల్లో డిస్టింక్షన్, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం తరఫున ఆయన అభినందించారు.

హామీలు మరచి నేతల కొనుగోలు

● ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్/కీసర రూరల్/మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరచి ప్రజాప్రతినిధులు, నాయకుల కొనుగోలు రాజకీయానికి తెరలేపిందని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలు మర్చిపోయి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందేందుకు పజాప్రతినిధులను, నాయకులను సంతల్లో పశువులను కొన్నట్లు కొంటున్నారని ఆరోపించారు. ఈటల రాజేందర్ గెలుపునకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొంగళ్ల బాలేష్, కరుణాకర్ పాల్గొన్నారు. నాగారం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు వంశరాజ్ మల్లేష్, ఆయన కుమారులు రాజు, రాజేష్, అల్లుడు శంకర్‌లు మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి నాయకులు పాల్గొన్నారు. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేటలో బిజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో రథాంగ పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 15: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని అక్కన్న మాదన్నల వారు నిర్మించిన ప్రసిద్ధ శ్రీలక్ష్మీ నారాయణస్వామి వారి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా రథాంగ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హోమంతో పాటు వాహనపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ దానంగారి కృష్ణారెడ్డి, మధుసూధన్ ముదిరాజ్, ప్రమోద్ రెడ్డి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్15: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల లక్ష్యం పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచుతూ పనులు చేయించాలని, పూర్తి అయిన వాటికి తప్పని సరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. కూలీలు పనిచేసే చోట వసతులు కల్పించాలన్నారు. పంచాయతీ, పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఎంపీడీవో, కమిషనర్లు అమ్మ ఆదర్శ పాటశాల కమిటీ వారితో మాట్లాడి పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ , డీఈవో, ఎంపీడీలు, ఏపీవోలు తదితరులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలుపై సోమవారం పౌరసరఫరాలశాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 122 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, అవసరాల మేరకు 129 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వ అందిస్తున్న కనీసం మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. 2023-24 వానాకాలానికి సంబంధించిన కస్టం మిల్లింగ్ రైసును (సీఎంఆర్) వెంటనే ఎఫ్‌సీఐకి చేరేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

మార్పు తెచ్చిన యుగ పురుషుడు మోదీ

» బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 15: సమాజంలో మార్పు తెచ్చిన యుగ పురుషుడు దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకృష్ణా గార్డెన్‌లో సోమవారం ప్రజా ఆశీర్వాదసభ నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మరో సారి దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో శ్మశానవాటికలు, మరుగుదొడ్లు, సర్పంచుల నిధులు మోదీ ఇచ్చినవేనని తెలిపారు. బీఆర్ఎస్ అప్పులకుప్పను పెట్టిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఎంపీ రంజిత్ రెడ్డి కరోనా సమయంలో హనుమాన్ దేవాలయం భూమినికబ్జా చేసిన వ్యక్తి రంజిత్ రెడ్డి అని, దానా కుంభకోణం, గుడ్ల కుంభం కోణం చేసిన వ్యక్తి అని మండిపడ్డారు. దేశం మొత్తం నరేంద్రమోడీ వైపు చూస్తుందని వచ్చే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, బీజేపీ నాయకులు వడ్లనందు, పాండుగౌడ్, శివరాజు, విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, పోకల సతీష్ పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే మా మద్దతు

తాండూరు రూరల్: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే తమ మద్దతు తెలుపుతూ ఆయన గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం తాండూరు నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్ల కేటాయింపు విషయంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ మద్దతుతో విశ్వేశ్వర్‌రెడ్డి గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎల్.శేఖర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పి.నర్సింహులు మాదిగ, ప్రకాష్, స్వామిదాస్, మహేందర్, గుడిసె గోపాల్, సూర్య ప్రకాష్, సుభాష్, శ్రీనివాస్, పరశురాం పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలని ఇంటింటి ప్రచారం

ధారూరు, ఏప్రిల్ 15: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఓటేసి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. ధారూరులో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండుగౌడ్, నెల్లి విశ్వనాథం, ఎం.రమేశ్, రాజేందర్ గౌడ్, కృష్ణ, విజయలక్ష్మి, రాఘవేందర్ గౌడ్, మహేష్, అనిల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, జగదీశ్వర్, వెంకట్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఓటర్లను కోరారు. ఇదే సోమవారం రాజేంద్రనగర్ 172వ బూత్‌లో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. నరేంద్రమోదీ తిరిగి ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంజ బాబురావు, నాయకులు పులిమామిడి రవీందర్, జ్ఞానేశ్వర్, పవన్, డి.కవిత, ఎస్.పెంటయ్య, ఎ.రఘుమారెడ్డి, వి.దయాకర్, ఎం.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అనంతరెడ్డి, మంగమ్మనారాయణకు కండువా కప్పుతున్న కసిరెడ్డి, మల్లు రవి

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

» కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ

ఆమనగల్లు , ఏప్రిల్ 15 : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, ఓటుతో మోదీ నియంతృత్వ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. మంగళపల్లి గ్రామానికిచెందిన వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ నిట్ట మంగమ్మనారాయణ సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. నగరంలోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇంట్లో ఆయన, మల్లు రవి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి, మల్లు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మల్లు రవిని భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని నారాయణరెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న ప్రజాపాలన, ఆరు గ్యారంటీ పథకాల అమలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు అనంతరెడ్డి, మంగమ్మనారాయణ చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ , పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, భట్టు కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జగన్, పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో జంగారెడ్డి, కృష్ణయ్య గౌడ్, నిరంజన్, మల్లేశ్, వెంకటనర్సింహరెడ్డి, తదితరులు ఉన్నారు

బంగారు, వెండి ఆభరణాల పట్టివేత

» లక్ష నగదు, చీరలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

ధారూరు/యాచారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం రాత్రి వికారాబాద్ జిల్లా ధారూరులో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా బంగారం, వెండి అభరణాలు, నగదు పట్టుబడింది. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాలు తనీఖీలు చేస్తుండగా హైదరాబాద్ నుంచి తాండూర్ వైపు వెళ్తున్న కారు(టీఎస్34 డి1800)లో 29.2తులాల బంగారు (విలువ రూ.18,14,240), 3.12కిలోల వెండి(రూ.2,11,600) ఆభరణాలు పట్టుబడ్డాయన్నారు. తాండూరుకు చెందిన మనోహర్ వీటిని కారులో తాండూర్‌కు తరలిస్తుండగా సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు. అలాగే తాండూరుకు చెందిన ఖాజా ఫైజన్ పటేల్‌కు చెందిన కారు(టీఎస్08 ఈయూ2781)లో రూ.2లక్షలు పట్టుకుని ట్రెజరీకి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు మించి, ఆభరణాలు, వస్తువులు తరలిస్తుంటే సరైన ఆధారాలు చూపాలని ఎస్ఐ వివరించారు. కాగా ధారూరులో తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం, వెండి ఆభరణాలు పెళ్లి ఆర్డర్లుగా తెలిసింది. తాండూర్‌కు చెందిన ఓ బంగారు వ్యాపారికి ఐదు పెళ్లిళ్లకు ఆభరణాల ఆర్డర్లు వచ్చాయి. ఆభరణాలను హైదరాబాద్ నుంచి తాండూరుకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. వాటికి సంబంధించి ఆధారాలు ఇచ్చి ఆభరణాలు విడిపించుకుంటామని యజమానులు తెలిపారు. మరో ఘటనలో హైదరాబాద్ నుంచి నల్లగొండ జిల్లా దేవరకొండకు కారులో తరలిస్తున్న రూ.లక్ష విలువైన చీరలను సోమవారం రంగారెడ్డి జిల్లా యాచారం పోలీసులు పట్టుకున్నారు. యాచారంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి దేవరకొండకు కారు(టీఎస్05 ఎఫ్ఎఫ్7999)లో ప్యాక్ చేసి తరలిస్తున్న చీరలను గమనించారు. చీరలు తరలిస్తున్న కోటేష్ అనే వ్యక్తిని వివరాలు అడగ్గా అతడు సరైన సమాధానం చెప్పలేదు. దీంతో పోలీసులు విషయాన్ని సీఐ శంకర్‌కుమార్‌కు తెలియపర్చారు. సరైన ఆధారాలు లేని కారణంగా కారును, చీరలను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ. 1.50 లక్షల నగదు సీజ్

తాండూరు, ఏప్రిల్ 15: వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై లక్షా యాభై వేలు తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు సిఐ సంతోష్ కుమార్ తెలిపారు. సిరిగిరిపేట్‌కు చెందిన మద్దూరి అరవింద్ కుమార్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలించినట్లు తెలిపారు. సీజ్ చేసిన డబ్బులను కలెక్టరేట్‌లో ట్రెజరీకి పంపినట్లు తెలిపారు.

ఓట్ల కోసం శ్రీరాముడి పేరును వాడుకుంటున్న బీజేపీ

ఆ పార్టీని చిత్తుగా ఓడించాలి

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్, ఏప్రిల్ 15 : ఓట్ల కోసం బీజేపీ శ్రీరాముడి పేరును వాడుకుంటోందని, ఆ మతతత్వ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో షాద్‌నగర్ టౌన్, ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ షాద్‌నగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చినట్లు నిరూపిస్తే తాను ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనని ఆమెకు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లడుతూ ఒకే పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కొరత ఉండదన్నారు. వంశీచంద్‌ను గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయిందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ఎల్ల నమోని యాదయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజుగౌడ్, బాబర్‌ఖాన్, రఘు, చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు సీఎం రాక

ఈ నెల 19న తాను దాఖలు చేయబోతున్న నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని వంశీచంద్‌రెడ్డి తెలిపారు. ప్రచారం చివరి రోజు షాద్‌నగర్ పట్టణంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారని అయన వెల్లడించారు. జర్నలిస్టులు ఎదురుకొంటున్న సమస్యలతో పాటు ఇళ్ల స్థలాల అందజేతకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.



ఆలయంలో ప్రత్యేకపూజలు చేస్తున్న ఏపీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి, ఐజీ నాగిరెడ్డి

కీసరగుట్టలో ఏపీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఐజీ పూజలు

కీసర, ఏప్రిల్ 15: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఏపీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి, ఐజీ నాగిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసి, శ్రీ దుర్గా భవాని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు . మండపంలో జవహర్‌రెడ్డి, నాగిరెడ్డి దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో నరేందర్, సభ్యులు రమేష్ శర్మ, నారాయణ శర్మ, ఉమాపతిశర్మ, వెంకటేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జుంటుపల్లి జాతర



యాలాల, ఏప్రిల్ 15: మండలంలోని జుంటుపల్లి సీతారాముల జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపక వంశపారపర ధర్మకర్తలు జె.రాఘవేంద్రరావు దేశ్‌ముఖ్, వారి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 10.15గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, బుధవారం 11.31గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, గురువారం మధ్యాహ్నం 3.35గంటలకు పెరుగు బస్వంతం, శేషవాహన, శుక్రవారం మహాలక్ష్మీపూజ, హరికథ కాలక్షేపం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవానికి తాండూరు, కొడంగల్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా బస్సుసౌకర్యాలు కల్పించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాదు

» కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 15 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా రాదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ గ్రామాల మాజీ సర్పంచ్‌లు సుజాత, లక్ష్మిమోతినాయక్, మాజీ ఎంపీటీసీలు నందంగౌడ్, సురేందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నరేందర్ ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో ప్రజలు బొందపెడుతారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

రాజేంద్రనగర్ : రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడానికి ఎన్ఎస్‌యూఐ నాయకులు కష్టపడి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు వేంనరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్స్ లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో వేం నరేందర్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సంవత్సరం చివరి నాటికి రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మీ, డీసీసీ ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్, శంషాబాద్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని హైదర్‌గూడలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వివేకానందనగర్ డివిజన్ పరిధి రామకృష్ణనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివరాత్రి రవికుమార్, భారతమ్మ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బూత్‌కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మియాపూర్ నరేన్ గార్డెన్‌లో సోమవారం బూత్ కమిటీ సభ్యులు, నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అభ్యర్థి రంజిత్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, జెరిపెటి జైపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి మాట్లాడారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ బాలాజీ



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్, ఓటర్లు

కొత్తూర్, ఏప్రిల్ 15 : 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఓటు హక్కు వినియోగంపై సోమవారం అవగహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా నిర్భయంగా ఓటు వేయాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● చేవెళ్ల ఫైర్ అధికారి బిక్షపతి



అవగాహన కల్పిస్తున్న అధికారులు.

చేవెళ్ల ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాల పట్ల అప్రత్తంగా ఉండాలని, గ్యాస్ సిలిండర్లు ఉన్న చోట జగ్రత్త వహించాలని చేవెళ్ల ఫైర్ అధికారి బిక్షపతి ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం ఫైర్ అధికారులు, సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో రైతులు, ప్రయాణికులకు అగ్ని ప్రమదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలను వంటగదిలో వదిలి పెట్టకూడదని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పర్కిరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల, ఏప్రిల్ 15 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కు కార్మికులతో కలిసి ఆయన వినతి పత్రం అందచేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు, వారాంతపు సెలవులు, డ్రైవర్లకు లైసెన్స్‌లు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సూదిని రంగారెడ్డి, నాయకులు దకరయ్య, అజీమోద్దిన్, బిక్షపతి, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



వార్షికోత్సవంలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

షాబాద్, ఏప్రిల్ 15 : కష్టపడి చదివతే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ వక్త భాస్కరయోగి, మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. ఆదివారం రాత్రి జరిగిన మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీ చైతన్య హై స్కూల్ వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్ విజయం ఖాయం

శంషాబాద్ రూరల్ 15 : లోక్‌సభ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ మోజార్టీ ఇస్తామని, చేవెళ్ల ఎంపీగా తమ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమని చిన్నగోల్కొండ సొసైటీ చైర్మన్ బొమ్మ దినకర్ గౌడ్ అన్నారు. శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పాస్‌బుక్‌లు ముందుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే బహదూర్‌గూడకు అత్యధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేశారని చెప్పారు. ఎంపీ రంజిత్‌రెడ్డి గతంలో బీఆర్ఎస్ తరపున ఎంపీగా గెలిచి నేడు అధికారం కోసం మళ్లీ కాంగ్రెస్‌లో చేరి ప్రజలను నయవంచన చేశాడని అన్నారు. తాగు నీటి కోసం జనం ఇబ్బంది పడుతుంటే కాంగ్రెస్ నాయకులకు పట్టింపు లేకుండ పోయిందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అశోక్ యాదవ్, ధన్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

షాబాద్, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం సోమవారం కనుల పండువగా, అంగరంగ వైభంగా వేద పండితులు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసులు తీసుకువచ్చిన తలంబ్రాలు స్వామి వారికి పోశారు. శివనామ స్మరణతో దేవాలయం మార్మోగింది. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



షాబాద్ : కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

భక్తి శ్రద్ధలతో బీరప్ప కల్యాణం

కొత్తూర్ : మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో గల శ్రీ బీరప్పస్వామి దేవాలయంలో సోమవారం బీరప్పస్వామి, కమరావతిదేవిల కల్యాణాన్ని గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కళాకారులు ఒగ్గు కథ వినిపించారు. జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమలు బీరప్ప కల్యాణాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కడాల శ్రీశైలం, దేశాల భీమయ్య, జంగయ్యయాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



కొత్తూర్ : పూజలు చేస్తున్న భక్తులు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు : మండల పరిధి అయ్యసాగర్‌లోని శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్ర స్వామి సరస్వతి, సీతా రామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నేడు, రేపు జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు సిద్ధమైంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఇక్కడ వసతులు ఏర్పాటు చేశారు. నేడు వివిధ పూజలు, రేపు శ్రీ సీతారాముల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కడ్తాల్ : నేటి నుంచి ఈనెల 18 వరకు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు మండల కేంద్రంలోని ఈదమ్మ దేవాలయంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయామానంగా అలంకరించారు. వివరాలను నిర్వాహకులు తెలిపారు. 16, 17న గంగ బోనాలు, ఈదమ్మ బోనాలు, ఈదమ్మ కథ, 18న కల్యాణం ఉంటుందని తెలిపారు.

యాచారం : యాచారం మండలంలోని నల్లవెల్లి గుట్టపై గల శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఈనెల 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 17న స్వామి వారి కల్యాణోత్సవం, 18న సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు 20న పూలరథోత్సవం, 24న స్వామి వారి రథోత్సవం, మిగతా రోజుల్లో వివిధ పూజలు, 25న గ్రామంలో లవకుశ వీధి నాటక ప్రదర్శన ఉంటుందని ఆలయ నిర్వాహకులు చెప్పారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.



ఆమనగల్లు : అయ్యసాగర్ దేవాలయం

రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం

కందుకూరు, ఏప్రిల్ 15 : రాష్ట్రంలోని రైతుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని దాసర్లపల్లి తాండలో పర్యటించిన ఆమె కాన్వాయ్‌ని ఆపిన ఓ గిరిజన రైతు జగ్గునాయక్ తన సమస్యను వివరిస్తూ విలపించాడు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులను ఆదుకోని ప్రభుత్వం అసమర్థ పరిపాలన సాగిస్తోందన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం లక్షల రుణమాఫీని చేయకుండా, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నెలలుగా రైతుల పరిస్థితి దారుణంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదన్నారు. ఎంపీటీసీ టి. ఇందిరదేవేందర్, మాజీ సర్పంచ్ బి బాలమణిఅశోక్, తదితరులు పాల్గొన్నారు.



సమస్యను వింటున్న పి.సబితాఇంద్రారెడ్డి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



సీఎంతో కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు, ఏప్రిల్ 15 : సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎంకు వివరించారు. వాటి పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఆనంద్, భూపతిరెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, సంజీవ్‌కుమార్ తదితరులున్నారు.

ముదిరాజుల అభివృద్ధికి కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 15 : ముదిరాజుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నారాయణపేటలో సోమవారం జరిగిన జన జాతర సభకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అంతకు ముందు షాద్‌నగర్ పట్టణంలోని పండుగ సాయన్న విగ్రహానికి ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించెందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, వాసు, మధు తదితరులు ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి

● జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్

కడ్తాల్, ఏప్రిల్ 15 : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నియంత పాలన సాగిస్తున్నాయని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామిల అమలులో పూర్తిగా విఫలమైందని, బీజేపీ మతం పేరిటదేశంలో విధ్వంసాన్ని సృష్టిస్తూ అధికారాన్ని కాపాడుకునేందుకు కుట్రలు సాగిస్తుందని ఆయన ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఎన్నికల ప్రచార రథాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమి లేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ కు త్వరలో మళ్లి పూర్వవైభవం వస్తుందని దశరథ్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ బావండ్ల పల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మ రెడ్డి పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి

చౌదరిగూడ, ఏప్రిల్ 15 : బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని, ప్రతీ ఓటరును కలుసుకొని ప్రధాని మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలిజేయాలని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సూచించారు. సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య అధ్యక్షతన చౌదరిగూడలో ఉమ్మడి కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. పదేళ్లుగా దేశాభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావాలని కోరుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో గద్దెనెక్కిన కాంగ్రెస్ మహిళలను ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. అనంతరం ఉమ్మడి కొందుర్గు మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడమండలానికి చెందిన దీలిప్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు ఆమె సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొందుర్గు మండలాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.



కండువాలు కప్పుతున్న అరుణ

ఉపాధ్యాయురాలికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కీర్తి

చౌదరిగూడ, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని పీర్జాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పోమాల కీర్తి అనే ఉపాధ్యాయురాలికి వెలుగు సాహితి వేదిక మయూరి జాతీయ పురస్కారం లభించింది. నాట్య కళారంగంలో అందించిన సేవలకు గాను హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో ఉగాది కానుకగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, తెలుగు సాహితి గౌరవ అధ్యక్షుడు శాంతి కృష్ణ ఆచార్య, తెలుగు వేదిక చైర్మన్ రాజ్‌కుమార్‌లు ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం

కొత్తూర్, ఏప్రిల్ 15: శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని, క్రీడలతో మానసిక ప్రశాంతత పొందవచ్చని కొత్తూర్ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీకాంత్ స్మారక క్రికెట్ టోర్నీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడలతో స్నేహబావం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. గుడూర్ మాజీ సర్పంచ్ సత్తయ్య, బీఆర్ఎస్ యువజన నాయకులు శ్రీశైలం, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేవెళ్ల : శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని అరుణోదయ యూత్ క్లబ్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలో అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో విభూతి సురేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్‌తో యువత మధ్య స్నేహం పెరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, నగదును అందించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీధర్, నాయకులు మోహన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ప్రణీత్‌కుమార్, తదితరులున్నారు



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

కాంగ్రెస్ బూత్ కమిటీల ఎన్నిక

కందుకూరు, ఏప్రిల్ 15:మండలంలోని నేదునూరు గ్రామ కాంగ్రెస్ భూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా మైనార్టీ ప్రధానకార్యదర్శి, మండల కో-ఆర్డినేటర్ ఎండి అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డిలు ప్రకటించారు. సోమవారం ఆ గ్రామంలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజీత్‌రెడ్డి గెలుపు కోసం బూూత్ కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అధ్యక్షుడిగా బొర్ర సురేష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా బోయ భాస్కర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా అంకగళ్ల జగన్, ఎస్‌టి సెల్ అధ్యక్షుడిగా బనావత్ శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండి పర్వేజ్‌లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

చేవెళ్ల, ఏప్రిల్ 15 : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్ అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్‌లోని తక్షశిల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టాపడి చదువుకుని ఉన్నతులుగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలమీద పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. పాఠశాల చైర్మన్ సయ్యద్ బాబర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు సైయ్యద్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

అనసూయమ్మ మృతికి సంతాపం

ఆమనగల్లు, ఏప్రిల్ 15: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మదుయాష్కి గౌడ్ మాతృమూర్తి అనుసూయమ్మ మృతి పట్ల టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ , బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్ లు సంతాపం తెలిపారు. హైదరాబాద్ లోని మదుయాష్కి నివాసంలో అనుసూయమ్మ భౌతికకాయాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. మదుయాష్కి గౌడ్‌ను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదిభట్ల, ఏప్రిల్ 15 : ఒకే చోట చదువుకొని వివిధ రంగాల్లో స్థిర పడ్డ మహేశ్వరం మండలం కొంగర రావిరాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1986-87 బ్యాచ్‌కు విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత సోమవారం ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ గ్రామంలోని శ్లోకా కన్వెన్షన్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులు మల్లప్ప(93) పాదాలు కడిగి, సత్కరించారు. కొత్త అశోక్‌గౌడ్, పండాల లక్ష్మీపతిగౌడ్, నారాయణ శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్ ఉమా రాణి, భారతి, పాల్గొన్నారు.



ఆదిభట్ల : ఆత్మీయ సమ్మేళనంలో 1986-87 విద్యార్థులు

మంచాల : మండల పరిధిలోని జాపాల జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2006-07లో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 16 ఏళ్ల తరువాత సమావేశమై నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. వినోద కార్యక్రమాలతో కాలక్షేపం చేసి సాయంత్రానికి ఇళ్లకు తిరిగి వెళ్లారు.

ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య ప్రభంజనం

ఆదిభట్ల, ఏప్రిల్ 15 : జనవరిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఇఎన్‌టీఎస్‌ఓ)-2 పరీక్ష ఫలితాల్లో ఆదిభట్లలోని శ్రీచైతన్యవిద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ సంస్థ దిల్‌సుక్ నగర్ జోన్ ఏజీఎం టి.సతీష్ తెలియజేశారు. సోమవారం ఆదిభట్ల బ్రాంచ్‌లో సోమవారం ఒలంపియాడ్ - 2 పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించి విద్యార్థులకు యాజమాన్యం ల్యాప్టాప్, ట్యాబ్, స్మార్ట్ వాచ్‌లతో పాటు మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యాసంస్థల ఆర్ఐలు రవిందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, అకాడమిక్ కోఆర్డీనేటర్లు పుల్లారావు,పాల్గొన్నారు

క్రైం కార్నర్

కళ్లలో కారం చల్లి.. గొలుసు అపహరణ

కందుకూరు, ఏప్రిల్ 15 : ఒంటరిగా వెళుతున్న ఓ మహిళ కళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు కారం చల్లి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పారిపోయిన సంఘటన ఆదివారం రాత్రి కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంపేట సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బేగంపేట గ్రామానికి చెందిన గుండ్రపల్లి సుశీల అనే మహిళ తన బంధువుల ఇంటికి వెళ్లి, తిరుగు రాచులూరు నుంచి బేగంపేటకు కాలినడకన వెళుతోంది. బేగంపేట రైతు వేదిక సమీపంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సుశీల కంట్లో కారం చల్లారు. ఆమె మెడ లోంచి బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. సమీపంలో ఎవరు లేకపోవడంతో ఆమె నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. అనంతరం గ్రామానికి చేరుకున్న ఆమె గ్రామస్థులకు జరిగిన విషయాన్ని చెప్పినా ఫలితం లేక పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఫలితం లేకుండా పోయింది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

20 తులాల బంగారు నగలు చోరీ

యాచారం, ఏప్రిల్ 15 : ఓ వ్యక్తి తన చెల్లెలు ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో ఉన్న 20 తులాల బంగారు నగలు చోరీ అయిన ఘటన సోమవారం సాయంత్రం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గ్రామంలో జరిగింది. మహ్మమ్మద్ రఫిక్ అనే వ్యక్తి ఆదివారం ఉదయం పది గంటలకు నల్గొండ జిల్లాలోని పీఏ పల్లి గ్రామంలో ఉండే తన సోదరి ఇంటికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం తిరిగి తన ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరచి ఉండడంతో పాటు ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువాలోని 20 తులాల బంగారు నగలు చోరీ అయినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించగా వాటు ఘటనా స్థలానికి ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్ వెళ్లి క్లూస్ టీంతో పరిశీలించారు. అతని ఇంటి పక్కన ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్, ఎస్సై వెంకటనారాయణ చెప్పారు.

ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

శంషాబాద్ రూరల్ 15 : శంషాబాద్ మండలంలోని పాల్మాకుల గ్రామంలోని ఎస్బీఐ ఏటీఎంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, రూ.18.99లక్షల నగదులను దుండగులు అపహరించిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. శంషాబాద్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాల్మాకుల గ్రామంలోని ఏటీఎంలోకి ఆదివారం తెల్లవారు జామున దుండగులు వెళ్లి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గ్యాస్ కట్టర్ సాయంతో ఏటీఎంను పగులకొట్టి అందులోని వీస్యాట్ మోడెం బాక్స్‌ను ధ్వంసం చేసి, ఆ బాక్స్ ఏటీఎంలో ఉన్న రూ.18.99లక్షల నగదును చోరీ చేశారు. ఆ బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ పోలీసులు చెప్పారు.

గంజాయి స్వాధీనం.. యువకుడి రిమాండ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 15 : పట్టణంలోని ఓ యువకుడి నుంచి ఆదివారం రాత్రి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సోమవారం పోలీసులు రిమాండ్‌కు పంపారు. వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఆదివారం రాత్రి కాట్రోత్ రాజేష్ అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో తిరుగుతండగా ఎస్సైలు మారయ్య, షైబెల్లి అతన్ని అదుపులోకి తీసుకోగా అతని వద్ద రెండు ప్యాకెట్లలో 150 గ్రాముల గంజాయి, తినడానికి ఉపయోగించే రోలింగ్ పేపర్ దొరికాయి. నింధితుడి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం కడీల బావి తండా అని, కొన్ని రోజులుగా ఇబ్రహీంపట్నంలో నివాసముంటూ కూలీ పనిచేస్తున్నాడు. ఈ మేరకు నిందితుడిపై కేసులు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు పంపారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15 : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం శంషాబాద్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్జుగడ్డ తండాకు చెందిన ముడవత్ శంకర్‌నాయక్(42), తన కూతురుతో బైక్‌పై వెళ్లి ఇబ్రహీంపట్నం రెసిడెన్షియల్ స్కూల్‌లో కూతురిని విడిచిపెట్టి వస్తుండగా శంకరపురం పీ వన్ రోడ్డు వద్ద కుక్క అడ్డం వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. శంకర్‌నాయక్‌కు తీవ్ర గాయలయ్యాయి. వాహనాదారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు శంకర్‌ను శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు సాయంత్ర మృతిచెందాడు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదంలో శంకర్ మృతిచెందడంతో అతడి భార్య, ముగ్గురు పిల్లలు బోరున విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొని మరొకరు..

ఆదిభట్ల: బైక్ కల్వర్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నాదర్‌గుల్‌లో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన బంగారి ప్రసాద్ సైదాబాద్‌లో ఉంటూ ఏడాదిగా క్యాటరింగ్ పనిచేస్తున్నాడు. ఆదివారం మీర్‌పేట్‌లో క్యాటరింగ్ పని ముగించుకొని సోమవారం తెల్లవారు జామున బైక్‌పై కుర్మల్‌గూడలో ఉండే అత్తగారి ఇంటికి వస్తున్నాడు. నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ కళాశాల సమాపంలో రోడ్డు దాటుతుండగా బైక్ అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొంది. ప్రసాద్ పక్కనే ఉన్న నాలాలో పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి అతడిని 108లో ఆస్పత్రికి తరలించగా ప్రసాద్(30) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రసాద్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్టు

● రూ.20,440, ఏడు సెల్‌ఫోన్ల స్వాధీనం

ఆదిభట్ల, ఏప్రిల్ 15: పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసిన ఘటన ఆదిభట్ల పరిధిలోని మన్నెగూడలో సోమవారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ నీలం సంజీవరెడ్డి నగర్ కాలనీలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. ఎస్వోటీ, ఆదిభట్ల పోలీసులు కలిసి దాడి చేశారు. దీంతో పేకాట ఆడుతున్న ఏడుగుర్ని అదుపులోకి తీసుకొని వారి ఉంచి రూ.20,440, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ముచ్చర్లలో రెండిళ్లలో చోరీ

యాచారం, ఏప్రిల్ 15 :హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముచ్చర్లలో సోమవారం తెల్లవారు జామున రెండిళ్లలో చోరీ జరిగింది. సీఐ నర్సింహా రావు తెలిపిన వివరాల మేరకు.. ముచ్చర్లలో కోసిక శ్రీశైలం వేసవి తాపం కారణంగా ఆదివారం రాత్రి తన ఇంటి దాబాపై కుటుంబీకులతో నిద్రించారు. సోమవారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు ధ్వంసం చేసి కిలో వెండి, తులం బంగారు ఆభరణాలు చోరీ చేశారు. కాగా ఇదే గ్రామంలో డేరంగుల సుగుణమ్మ కడ్తాలలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లింది. దీంతో దొంగలు ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి 15తులాల వెండి నగలు, రూ.30వేల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పశువుల పాక దగ్ధం.. తప్పిన ప్రమాదం

ఆమనగల్లు, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో ఓ పశువుల పాక దగ్ధమై త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. మాడ్గుల రామచంద్రయ్య అనే వ్యక్తి ఇంటి పక్కనే పశువుల పాక ఉంది. సోమవారం మధాహ్నం దానికి నిప్పంటుకొని పెద్ద ఎత్తున మంటలు రేగాయి. ఆసమయంలో రామచంద్రయ్య కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో చుట్టు పక్కల వారు సమాచారం అందించారు. వారు వచ్చే సరికి పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో పశువులు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. వ్యవసాయ పనిముట్లు, పశుగ్రాసంతో పాటు పలు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రామచంద్రయ్య కోరారు.